## క్లుప్తంగా

### మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

**మణుగూరురూరల్:** మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ మహిళ నాయకురాలు 'నారీ న్యాయ ఆందోళన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరుపు రంగు దుస్తులు ధరించి మహిళల పట్ల బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ.. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా మహిళా కార్యదర్శి బోడా దివ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు బండ్ల రజిని, పినపాక నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, మండల అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, గోనె రేణుక, చందా రత్తమ్మ, సమ్మక్క, పద్మ పాల్గొన్నారు.

### జాతీయ క్రీడా దినోత్సవం

**దమ్మపేట:** క్రీడలతోనే విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పట్వారిగూడెం జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొని, ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని రామానుజవరం గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.యశోద పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. పీడీ పోలెబోయిన అనిల్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర సమితిలో స్థానం

**అశ్వారావుపేట:** సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా అశ్వారావుపేటకు చెందిన సయ్యద్ సలీం ఎంపికయ్యారు. గురువారం అశ్వారావుపేటకు వచ్చిన సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ ఘనంగా సన్మానించారు.

### పందిరి ముహూర్తం

**చర్ల:** మండల కేంద్రంలో నిర్వహించనున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించి గురువారం పందిరి ముహూర్తాన్ని నిర్వహించారు. గణేష్ నగర్, పద్మశాలీ బజార్, ముత్యాలమ్మవీధి, పాతచర్ల, లింగాపురం పాడు తదితర ప్రాంతాలలో మందిరి ముహూర్తాలను నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణమూర్తి నేతృత్వంలో ఈ పందిరి ముహూర్తాలు కొనసాగాయి. ఈ కార్యక్రమాల లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### తెలుగు భాషా దినోత్సవం

**మణుగూరురూరల్:** మండలంలోని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దొడ్డి భద్రయ్య మాట్లాడుతూ..అన్ని భాషల్లో తెలుగు భాషా ఎంతో గొప్పదైందన్నారు. అనంతరం ప్రిన్సిపల్‌ను, తెలుగు అధ్యాపకుడిని విద్యార్థులు, అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాధితుడికి ఆర్థిక సాయం

**దుమ్ముగూడెం:** మండలంలోని మంగవాయి బడవ గ్రామంలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధిత పోడియం సురేష్ కుటుంబానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆర్థిక సాయం అందచేశారు. గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి ఆర్థికసాయంతో పాటు నిత్యావసరాలను అందజేశారు. ఎస్సై వెంకటప్పయ్య, మండల కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, దర్శి సాంబశివరావు, పిలక వెంకటరమణారెడ్డి, కుంజా శ్రీనివాసరావు, కోడి చంటి, పూజారి సూర్యచంద్రరావు, సీపీఎం నాయకుడు పుల్లయ్య పాల్గొన్నారు.

### ఆలయంలో అన్నదానం

**మణుగూరురూరల్:** మండలంలోని సాయినగర్‌లో శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగగా.. మణుగూరు ప్రాంతానికి చెందిన కార్మిక సంఘ నాయకుడు కాపా శివాజీ-లీల దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీనివాస్, సునీల్‌లు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాత దంపతులను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇసుక మాఫియాకు అండదండ

- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా
- దుబ్బ ఇసుకకే అధికారులు మద్దతు
- కొన్ని ట్రాక్టర్లకే గ్రీన్ సిగ్నల్



అనంతారం వాగులో అక్రమంగా లోడ్ అవుతున్న ఇసుక

**అశ్వారావుపేట:** అశ్వారావుపేటలో ఇసుక మాఫియాకు అధికారుల సహకరిస్తున్నారా..? లేక అధికారులు కూడా ఇసుక మాఫియాలో భాగస్వాములయ్యారా..? అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. పైకి నిబంధనలు అందరికీ ఒకటే అని చెబుతున్నా.. కొందరికి మాత్రం సంపూర్ణ మినహాయింపు ఇచ్చినట్లు విమర్శల పాలవుతున్నారు. అశ్వారావుపేట మండలం ఇసుక వనరులు పుష్కలంగా ఉండటంతో ఇక్కడి నుంచే దమ్మపేట మండలానికి కూడా అక్రమ మార్గంలో ఇసుక రవాణా చేస్తుంటారు. పలుమార్లు పట్టుబడ్డ సందర్భాలూ ఉన్నాయి. జులై 18న కురిసిన భారీ వర్షానికి గుమ్మడవల్లి, నారాయణపురం, బచ్చువారిగూడెం, అనంతారం, నెమలిపేట గ్రామాల గుండా ప్రవహించే పెదవాగు భారీగా దుబ్బఇసుకను పొలాల్లో మేటలు వేసింది. దీనికి తోడు ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో వాగు ఖాళీ అయి ఇసుక రవాణాకు అనువుగా తయారయింది. దీంతో ఇసుకాసురులు రెవెన్యూ, పోలీస్ శాఖలను మచ్చిక చేసుకుని అక్రమ రవాణాకు తెరతీశారని విమర్శలు వస్తున్నాయి. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోల ఎక్కడ ఇసుక కావాలన్నా.. ఇసుక వ్యాపారులు గద్దల్లా వాలిపోతున్నారు. ఒక్కో ట్రక్కు ఇసుక రూ.3వేలు నుంచి రూ.3500 వరకు విక్రయిస్తున్నారు. అవసరమైతే పార్టీని బట్టి అప్పు కూడా ఇస్తున్నారు.

**నాణ్యమైన ఇసుకకు అధికారుల నో..**

అధికారుల అండదండలున్నా.. దొడ్డిదారిన రవాణా చేయడంతో వినియోగదారుడికీ చిక్కేనని చెప్పి నాణ్యత లేని ఇసుకను అర్ధరాత్రి అన్‌లోడ్ చేసి వెళ్లిపోతున్నారు. నారాయణపురం పొలాల్లో మేటలేసిన దుబ్బ ఇసుకను యథేచ్ఛగా రవాణా చేసేస్తున్నారు. వాగులో నీటి ప్రవాహం ఉన్నపుడు నీటిని తట్టలతో వడ వేసి సేకరించిన ఇసుక నాణ్యమైనది. కానీ నీటి ప్రవాహం లేని చోట దిబ్బలు దిబ్బలుగా ఉన్న దుబ్బ ఇసుకను నింపుకుని అమ్మేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ఇసుక వ్యాపారులు తెచ్చిందే బంగారమన్నట్లుగా వినియోగదారులు మోసపోతున్నారు. అశ్వారావుపేట సెంటర్ లైటింగ్ పనులకు కొందరు రవాణా చేసే దుబ్బ ఇసుకను మాత్రమే కాంట్రాక్టర్ వాడాలట.. నాణ్యమైన గోదావరి ఇసుకను అదే ధరలకు విక్రయిస్తామని కొందరు వ్యాపారులు వారిని ఆశ్రయించినా.. లేదు లేదు.. లోకల్ ఇసుకను కొందరు సరఫరా చేస్తున్నారు. మేం వారి వద్దనే కొనుగోలు చేయాలిక్కడ అని సమాధానం ఇచ్చారట. అసలే నకిలీ ఇసుక.. దొంగమార్గాన సేకరణ.. కాంట్రాక్టర్లను బెదిరించి మరీ అంటగడుతున్నారంటే ఇక ఇసుక మాఫియా ఏమేర విస్తరించిందో అర్థం చేసుకోవాలి మరి.

**ఆ 26 ట్రాక్టర్లకే అనుమతి!**

ఇసుక వాగుల నుంచి యథేచ్ఛగా సేకరించి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో విక్రయించుకుందామంటే క్షణాల్లో రెవెన్యూ లేదా పోలీస్ సిబ్బంది పట్టేసుకుంటారట. కేసు నమోదు చేయడం.. ట్రాక్టర్‌ను సీజ్ చేయడం జరుగుతుంట. కేవలం ఓ 26 ట్రాక్టర్లకు మాత్రమే ఇసుక అక్రమ రవాణాకు అవకాశం ఉందట. ఆ 26 మంది కూడా ఆమ్యామ్యాలు చెల్లించి.. కొందరు అధికారులు, సిబ్బంది ప్రయాణాలకు కార్లు సమకూర్చి, స్టేషనరీ ఖర్చులు భరించి రోజుకింత అని ముట్టజెప్పుకుంటే కుదరదట. సారూ.. మేమూ బతకాలి కదా మేమూ చెల్లిస్తాం. మీ ముడుపులు.. మేమూ భరిస్తాం మీ ఖర్చులు అని కొందరు లంచాధికారుల వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నా.. నో.. నో.. ఆ 26 ట్రాక్టర్లకే అవకాశం. వారిలో ఎవరైనా తప్పుకుంటే.. మిగిలిన వారి అనుమతి ఉంటేనే ఆ మాఫియాలో నువ్వు చేరవచ్చు. ఏ ఒక్కరు అభ్యంతరం పెట్టినా నీ ట్రాక్టర్ వెంటనే సీజ్ చేయాలసి వస్తుంది. అని చెప్పినట్లు ట్రాక్టర్ యజమానుల సర్కిల్‌లో ప్రచారం జరుగుతోంది. 24 గంటలు కొన్ని ట్రాక్టర్లు ఇసుక రవాణాలో నిమగ్నమై ఉన్నా.. అధికారులు, సిబ్బంది కంటపడకపోవడం విడ్డూరం. గతంలో అటవీ శాఖాధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేవారు. ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసే వారు. ఇప్పుడు అటవీశాఖాధికారులు ఇసుక ట్రాక్టర్ల జోలికి వెళ్లకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

**ఎవరికీ మినహాయింపులు ఉండవు**

ఇసుక అక్రమ రవాణాకు మేం ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ఇసుక రవాణా చేస్తూ ఎవరు పట్టుబడ్డా.. కేసులు నమోదు చేస్తాం. వినియోగదారులు కూడా అనుమతి లేని ఇసుకను కొనుగోలు చేయకూడదు.

– కృష్ణప్రసాద్, తహసీల్దార్, అశ్వారావుపేట

# సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా



కరకగూడెం: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**కరకగూడెం:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరులోని తన క్యాంప్ కార్యాలయంలో రూ.2 లక్షల 45 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ సీఎంఆర్‌ఎఫ్‌తోపాటు సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తోందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనతో మంచి రోజులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఎర్ర సురేష్, పూజారి వెంకన్న పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కరకగూడెం మండలానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.2.45లక్షల విలువ చేసే చెక్కులను గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అశ్వారావుపేటలో..**

**అశ్వారావుపేట:** అశ్వారావుపేట మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పంపిణీ చేశారు. గురువారం మండలంలోని ఆసుపాక, అనంతారం, గాండ్లగూడెం, మల్లాయిగూడెం గ్రామాల్లో పర్యటించి చెక్కులను పంపిణీ చేశారు. వారి వెంట తహసీల్దార్ కృష్ణప్రసాద్, గిర్దావర్ తాటి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### రుణమాఫీపై దరఖాస్తుల స్వీకరణ

**మణుగూరురూరల్:** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన రైతు రుణమాఫీలో భాగంగా ఇంకా అనేకమందికి రుణమాఫీ కాకపోవడంతో వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రుణమాఫీ కానీ రైతుల నుంచి భూమి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ జిరాక్స్ ప్రతులతో పాటు నిర్ధారణ సెల్ఫ్‌గ్రూప్ ఫోటోలతో వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్ చేస్తూ దరఖాస్తులను నమోదు చేసుకుంటున్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్లు ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు, ఏఓ చటర్జీ, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, రైతులు ఆవుల సర్వేశ్వరరావు, జూపల్లి ముత్తయ్య పాల్గొన్నారు.

### ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సన్మానం

**అశ్వాపురం:** అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను ఫారెస్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గురువారం భద్రాచలంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఫారెస్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, గొంది సంజీవ్, కలేటి వీరయ్య, మోహన్‌ప్రసాద్, సాగర్, ఎండి.మునీరు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు వినతి

**అశ్వాపురం:** మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలోని బీజీ కొత్తూరు గ్రామంలో పలు సమస్యలపై మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. బీజీ కొత్తూరు గ్రామస్తులు రేషన్ బియ్యం కోసం ప్రతి నెల ఐదు కిలోమీటర్లు మొండికుంట వస్తూ ఇబ్బంది పడుతున్నారని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఆర్ అండ్‌బీ రోడ్డు నుండి బీజీ కొత్తూరు రహదారి గుంతలను పూడ్చాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు పూజల ఆంజనేయులు, కారం శ్రీను, పర్వత నరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

### కఠినంగా శిక్షించాలి

**అశ్వారావుపేట:** కలకత్తాలో జరిగిన జూనియర్ డాక్టర్ దుర్ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని అవేర్ ఐటీఐ, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్‌లు జె.వెంకటేశ్వరరావు, డాక్టర్ లోరా అనూష, ఏఓ రాఘవరావు, దివిలి ప్రసాద్, మురళీ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎస్‌కె.సాబీర్ పాషా

**అశ్వారావుపేట:** కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత, అసంఘటిత కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఏఐటీయూసీ 18వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ పాలన అసంఘటిత వర్గానికి నరకం చూపిస్తోందన్నారు. అసంఘటిత వర్గాల్లో పనిచేస్తున్న వారిని లక్షలాది మందికార్మికులు వారి ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారని ఆరోపించారు. దేశంలో 2015 నంచి 2023 వరకు 63లక్షల అసంఘటిత రంగ సంస్థలు మూతపడ్డాయన్నారు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మోదీ, రేవంత్ ప్రభుత్వాలు అసంఘటిత వర్గాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. కొట్లాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మార్చాలనే కుట్రాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ సలీంలు మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా కారదర్శి వీ మల్లిఖార్జున్, గన్నిన రామకృష్ణ, ధర్మ, రాములమ్మ, సాయి విష్ణు, పఠాన్ జలాల్ ఖాన్, దోమల అనిల్, సత్యవతి, చెన్నారావు, జీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రంగాపురంలో వైద్య శిబిరం



మణుగూరురూరల్: మందులు పంపిణీ చేస్తున్న సింగరేణి వైద్యుడు శేషగిరిరావు

**అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని రంగాపురం గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారిణి డా.ప్రియాంక గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షా కాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలుకుట్టకుండ, పుట్టకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండ వైద్యశాలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రకాశ్‌రావు, వాణి, పుష్పా, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

**పెద్దిపల్లిలో..**

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని పునరావాస ఆదివాసీ గ్రామమైన పెద్దిపల్లిలో సింగరేణి సేవ సమితి, సింగరేని వైద్యవిభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సింగరేణి వైద్యులు శేషగిరిరావు వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 75మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల వెంట, నివాసాల్లో దోమల మందు పిచికారి చేయించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామస్తులకు డాక్టర్ తన సొంత ఖర్చులతో బ్రెడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగరేణి ఆస్పత్రి స్టాఫ్ నర్స్ రత్నకుమారి, శానిటరి ఇన్స్‌పెక్టర్ రామారావు, ఆస్పత్రి సిబ్బంది రాము, విజయ్, ఆశా వర్కర్ రోజా, గ్రామపెద్ద భీమయ్య, సేవా కో ఆర్డినేటర్ వి మారేశ్వరరావు, మాజీ కో ఆర్డినేటర్ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకచవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

**మణుగూరురూరల్:** వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆయన ఉత్సవ కమిటీల నిర్వాహకులతో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మండల, పట్టణ పరిధి ఏరియాల్లో వినాయక ఉత్సవాలు, నిమజ్జనాల నిర్వహణకు ఉత్సవ కమిటీ వారు నియమ నిబంధనలను పాటించాలన్నారు. వినాయక నిమజ్జన సమయాల్లో డిజెలకు అనుమతి లేదన్నారు. మద్యం సేవించి ఎవరైనా మండపాల వద్ద ప్రజాశాంతికి భంగం కలిగిగే విధంగా ప్రవర్తిస్తే వారిపైతిన చర్యలు తీసుకుంటామన్నారు. బాద్యుల వివరాలను మణుగూరు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. అలాగే ఏ రోజు నిమజ్జనం చేస్తారు, ఏ వాహనం వినియోగిస్తారనే విషయాలను కూడా ముందుస్తుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతీ ఒక్క ఉత్సవ కమిటి వారు మైక్, విద్యుత్ అనుమతులను ఆయా శాఖల ద్వారా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐ సతీష్‌కుమార్, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై మేడ ప్రసాద్, పోలీస్ సిబ్బంది, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, రాజకీయపార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



హాకీ ఆడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**అన్నపురెడ్డిపల్లి:** విద్యార్థులు క్రీడల్లో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎర్రగుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు వేముల నరేష్ ఆర్థిక సహాయంతో అందించిన హాకీ స్టిక్స్‌ను ఎమ్మెల్యే జారే విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొంతసేపు హాకీ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పాఠశాల ఆవరణంలోని గార్డెన్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, జూలూరుపాడ్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎంఈఓ సత్యనారాయణ, జెడ్పీ హెచ్‌ఎం ఆనంద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**డబుల్‌బెడ్రూం ఇళ్ల పరిశీలన**

**అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని పెంట్లం పంచాయతీ పరిధిలోని భాస్కరాపురం గ్రామంలో శిథిలావ్యస్థలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిర్మించి ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధింత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, త్వరితగతిన ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు మడివి నాగేంద్రబాబు, వస్రాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక డంప్‌ల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



కొత్తూరు శివారులో ఇసుక డంప్ చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐలు

**ములకలపల్లి:** అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్న డంప్ ప్రదేశాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పూసుగూడెం జీపీ పరిధిలోని పలుగ్రామాల శివార్లలో అక్రమంగా ఇసుకను నిల్వ చేస్తున్నారు. అర్ధరాత్రి వేళ లారీల్లో బైటికి తరలిస్తున్నారు. ఈ ఉదంతంపై 'ఇసుక అక్రమాలు ఆగట్లే' శీర్షికన గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన తహసీల్దార్ గుడ్ల పుల్లారావు తగు చర్యలకు ఉపక్రమించారు. దీంతో రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్లు (ఆర్‌ఐ) సత్యావతి, భద్రు గురువారం వీకే. రామవరం, కొత్తూరు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. అక్రమంగా ఇసుక నిల్వ చేసిన డంప్‌లను పరిశీలించారు. కాగా డంప్‌ల్లో నిల్వ చేసిన ఇసుకను, పూర్తిగా రాత్రివేళ లారీల్లో బయటకు తరలించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లారావు మాట్లాడుతూ.. ఇసుక అక్రమంగా నిల్వ చేసినా, తోలకాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

**కరకగూడెం:** సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పిలుపునిచ్చారు.ఈ మేరకు ఆయన గురువారం కరకగూడెం, అనంతారం, భట్టుపల్లి, రఘునాథపాలెం గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్థులను పరీక్షించి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యంగా సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పలు ఫస్ట్ ఎయిడ్,రక్త పరీక్ష కేంద్రాలతో పాటు మెడికల్ దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలను పాటిస్తూ ఎవరు కూడా పరిమితిని మించి వైద్యం చేయకూడదని సూచించారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో బెడ్లు, యాంటీబయాటిక్ ఇంజక్షన్లు వాడకూడదని తెలిపారు. ఆరోగ్య సహాయకులు నర్సింహారావు, కృష్ణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారిణికి అభినందన



భద్రాచలం: అమ్రిన్‌ను అభినందిస్తున్న పొదెం వీరయ్య



భద్రాచలంఅర్బన్: ధర్మతేజ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**భద్రాచలం:** అంతర్జాతీయ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన భద్రాచలం క్రీడాకారిణిని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య గురువారం అభినందించారు. ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జావలిన్ త్రో విభాగంలో భద్రాచలంకు చెందిన అమ్రిన్ బంగారు పతకం సాధించింది. గురువారం పొదెం వీరయ్య స్వగృహంలో క్రీడాకారిణిని, కాలేజీ ప్రిన్సిపల్ శేషుబాబు, కోచ్ గిరిప్రసాద్‌లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం మైనారిటీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.ఆరిఫ్, ఎస్.కె అలీమ్, బాబాజీ, ఉస్మాన్, మస్తాన్, పాషా, మైరుదిన్ పాల్గొన్నారు.

**క్రీడాకారుడికి ఆర్థిక సాయం**

**భద్రాచలంఅర్బన్:** క్రీడల్లో ప్రతిభను చూపించి రాణిస్తున్న క్రీడాకారుడు టింగ ధర్మతేజకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆర్థిక సాయం అందజేశారు. నేపాల్ దేశంలో జరుగుతున్న టైక్వాండో పోటీలలో పాల్గొనెందుకు వెళ్తున్న వాజేడు మండలం పేరూరు గ్రామానికి ధర్మతేజ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకట్రావు వెంటనే ధర్మతేజకు రూ.50 వేల చెక్కు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ర్యాలీని విజయవంతం చేయండి

**ములకలపల్లి:** పెన్షన్ విద్రోహ దినం పురస్కరించుకొని సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించ తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని ఉద్యోగ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం తహసీల్ వద్ద నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఓల్డ్‌బస్ డిపో వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శనకు ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పి.పూర్ణయ్య, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.కిషోర్, టీటీఎఫ్ మండల అధ్యక్షుడు టి.మాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.